# కేసముద్రం డబ్ల్యూజేఐ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కేసముద్రం/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):**జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) పనిచేస్తోందని జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కేసముద్రం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి రాములు, అధ్యక్షుడిగా మారేపాక జగన్, ఉపాధ్యక్షుడిగా బబూరి సతీష్, ప్రధాన కార్యదర్శిగా గంధం సతీష్, కోశాధికారిగా రాజేంద్రచారి, సహాయ కార్యదర్శిగా గంధసిరి యాకన్న ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు మారేపాక జగన్, ప్రధాన కార్యదర్శి గంధం సతీష్‌ను జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి డబ్ల్యూజేఐ నిరంతరం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, హెల్త్ కార్డులు, ఫీజు రాయితీలు తదితర ప్రయోజనాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందేలా కృషి చేస్తామని చెప్పారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యులు పల్లె శ్రీనివాస్, కొండి సాయికిరణ్, ఆలకుంట్ల శ్రీనివాస్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ సాయంతో పోయిన మొబైల్ రికవరీ

## బాధితుడికి ఫోన్ అప్పగించిన హసన్‌పర్తి పోలీసులు

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):**
తిరుపతిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో హసన్‌పర్తి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన ఎన్.ప్రశాంత్ గత మే 30న తిరుపతిలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. దీనిపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.




సీఈఐఆర్ ఆపరేటర్ ఎమ్.సోమన్న, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ కె.తిరుపతి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. ఫోన్ తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి నుంచి ప్రత్యేక చొరవతో కొరియర్ ద్వారా హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ శుక్రవారం బాధితుడు ప్రశాంత్‌కు మొబైల్‌ను అందజేశారు. ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

# చదరంగంతో మేధాశక్తికి పదును

## విద్యార్థుల్లో ఏకాగ్రత, తార్కిక ఆలోచన పెంపు -ధర్మసాగర్‌లో పోటీలకు 206 మంది విద్యార్థులు

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):**చదరంగం విద్యార్థుల్లో ఏకాగ్రత, తార్కిక ఆలోచన, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనీల్‌కుమార్ అన్నారు. ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలలో చదరంగం నెట్‌వర్క్, అబ్దుల్ కలాం ఫౌండేషన్, హనుమకొండ హరిత సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనీల్‌కుమార్ మాట్లాడుతూ చదరంగం ఆడటం ద్వారా విద్యార్థుల్లో ఓర్పు, ముందుచూపు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

మండల విద్యాధికారి శ్రీదేవి తొలి ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి 206 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ప్రధాన నిర్ణేత రాజనీకాంత్, నిర్ణేత శ్రీకాంత్ పర్యవేక్షించగా.. సాంకేతిక బృందం




సభ్యులు రాజేష్, సురేష్, రామకృష్ణ, మరో సురేష్ సమర్థవంతంగా నిర్వహించారు.

**విజేతలకు బహుమతులు**

పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులతో పాటు పతకాలు, చదరంగం బల్లలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చదరంగంలో మరిన్ని




అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు మేధో క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ రామయ్య, కృష్ణస్వామి, వెంకట్రాజం, ఆనంద్, ప్రొఫెసర్ ఆనంద్‌కిశోర్, వినయ్‌కాంత్‌రావు, డాక్టర్ విజయ్‌కుమార్, వి.రాజన్నతో పాటు హనుమకొండ హరిత సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతులతో పట్టు సాగు

## రైతులకు శాస్త్రవేత్త డా. వజ్రమ్మ సూచన

**ఐనవోలు/ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):**
వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే పట్టు సాగుతో స్థిరమైన ఆదాయం పొందవచ్చని కేంద్ర పట్టు పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డా. వజ్రమ్మ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగిస్తూ మల్బరీ తోటలను నిర్వహించుకోవాలని తెలిపారు.

ఐనవోలు మండలం కొండపర్తిలో శుక్రవారం మేరా రేషమ్‌మేరా అభిమాన్ కార్యక్రమంలో భాగంగా రైతుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వజ్రమ్మ మాట్లాడుతూ మల్బరీ తోటల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని, అవసరానికి అనుగుణంగా నీటిని అందించాలని సూచించారు. సరైన సమయంలో ఎరువులు




వినియోగించడం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చన్నారు. నీటి వనరులను సమర్థంగా వినియోగిస్తూ వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా సాగు చేపట్టాలని సూచించారు.

పట్టు పురుగుల పెంపకంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పురుగుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు, శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టు ఉత్పత్తులతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

# గులాబీ పురుగు గుబులు.. పత్తి రైతులు జాగ్రత్త!

## తొలిదశలో గుర్తించకపోతే తీవ్ర నష్టం.. విచక్షణారహిత పురుగుమందులతో మరింత ముప్పు

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. పురుగు ఉధృతి పెరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే తొలిదశలోనే గుర్తించి శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం ఎల్‌డీసీ, మారి, బీసీఐ ఆధ్వర్యంలో గులాబీ రంగు పురుగు నివారణ, నియంత్రణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గులాబీ పురుగు పత్తి పంటలోకి ప్రవేశించిన తొలిదశలోనే గుర్తించడం అత్యంత కీలకమన్నారు. పురుగు ఉధృతిని గమనించకుండా వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పొలాలను తరచూ పరిశీలిస్తూ పురుగు లక్షణాలను గుర్తించాలని సూచించారు. అవసరానికి మించి,




విచక్షణారహితంగా పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల పంటకు మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందని హెచ్చరించారు.

**రక్షణ లేకుండా పిచికారీ వద్దు**

పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రక్షణ దుస్తులు, మాస్కులు, చేతి తొడుగులు వినియోగించాలని అధికారులు సూచించారు. మందుల మోతాదును శాస్త్రీయంగా పాటించాలని, అధిక మోతాదులో వినియోగించవద్దని తెలిపారు. దీనివల్ల రైతుల ఆరోగ్యంతోపాటు నేల, నీరు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు.

**సుస్థిర సాగుతోనే రైతుకు లాభం**

బీసీఐ ప్రమాణాలు, సుస్థిర వ్యవసాయ విధానాలను పాటించడం ద్వారా పత్తి సాగులో పెట్టుబడి తగ్గించడంతోపాటు దిగుబడి, నాణ్యతను మెరుగుపరచవచ్చని అధికారులు వివరించారు. ఫామ్ పాండ్లు, బీఆర్‌సీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, కాషాయాల తయారీవినియోగం, అగ్రో ఫారెస్ట్రీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీసీ ప్రాజెక్టు ప్రతినిధి కార్తిక్, మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్, ఐసీఏపీ శాస్త్రవేత్త ఉపేందర్‌రావు, మంతపురం యాదగిరి, మారి బీసీఐ ప్రోగ్రాం మేనేజర్ రాజు, ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ చక్రపు వెంకటేశ్వర్లు, బీసీఐ సిబ్బంది, పెద్దపెండ్యాల సర్పంచ్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రఘు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను తల్లిదండ్రులే సన్మానించడం అభినందనీయం

## ఇన్‌చార్జి డీఈఓ మందుల శ్రీరాములు




**మహబూబాబాద్ /సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):**
ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యున్నతమైనదని ఇన్‌చార్జి డీఈఓ మందుల శ్రీరాములు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తల్లిదండ్రులు స్వయంగా సన్మానించడం అభినందనీయమన్నారు. కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏఐ, డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన అందిస్తున్నామని తెలిపారు. ఇంగ్లిష్ ప్రావీణ్యంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులకు పట్టు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మితో పాటు ఉపాధ్యాయులు ఆవునూరి రవి, ఆర్. రాధిక, సీహెచ్. శ్రీజ, కవిత, మమతలను అధికారులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

# సాయుధ పోరాట చరిత్రను బీజేపీ దొంగిలించజూస్తోంది

## నిజాం నిరంకుశత్వాన్ని కూల్చింది కమ్యూనిస్టులే -సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ దొంగిలించేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏకశిలా పార్కు వరకు కొనసాగింది. అక్కడి తెలంగాణ సాయుధ పోరాట అమరుడు ఠాణు నాయక్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజలు వీరోచిత పోరాటం చేశారని



తెలిపారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో తెలంగాణ నేల ఎర్రబారిందన్నారు. సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం పాలన అంతమైందని పేర్కొన్నారు. పోరాట సమయంలో పేదలకు భూములు పంచి, వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను, అమరవీరుల జీవితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ




కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్.అశోక్‌స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, అల్వాల రాజు, అలకుంట యాకయ్య, నోముల కిషోర్, రాంగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు

# ఆయుష్ విద్యార్థులకు స్టైఫండ్ తీపికబురు

**కేసముద్రం/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):**
ఆయుష్ విభాగంలో విద్యాభ్యాసం చేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను ప్రభుత్వం భారీగా పెంచడంపై కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సుదీర్ఘకాల నిరీక్షణకు తెరదించి స్టైఫండ్‌ను గణనీయంగా పెంచిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. హౌస్ సర్జన్ల స్టైఫండ్ రూ.13,754 నుంచి రూ.29,792కు, పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ.34,385 నుంచి రూ.74,482కు పెంచడం విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరమన్నారు. దీంతో విద్యార్థులు ఆర్థిక ఒత్తిళ్లకు దూరంగా వైద్య శిక్షణ, పరిశోధనలపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. ఆయుష్ వైద్య విధానాలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ అల్లం రమ కోరారు.



## కూడా చైర్మన్ గుండు సుధారాణికి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



**హసన్‌పర్తి/సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):** కూడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గుండు సుధారాణిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హసన్‌పర్తి 66వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కూడా కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామంచ ఐలయ్య, తాళ్ల మధు, గారిగే రాజు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

### రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి అవకాశం

**ఖమ్మం/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ వేదిక కానుందని జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలిపారు. ఖమ్మంలోని న్యాయ సేవా సదన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులను సత్వరంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

# ఎండుతున్న పంటలు.. ఆదుకోవాలి

## బీజేపీ నాయకుల డిమాండ్



**వేంసూరు/ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):** ఎల్నినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయని, బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కందుకూరు గ్రామంలో ఎల్నినో ప్రభావిత పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి పాల నాగ సురేంద్రరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఆఫీస్ జాయింట్ సెక్రటరీ గొర్ల శ్రావణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు నష్టం జరుగుతోందన్నారు. ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు ఎకరానికి రూ. 20 వేల వరకు కౌలు చెల్లించి, మరో రూ. 15 వేల వరకు పెట్టుబడి పెట్టారని తెలిపారు. పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదన్నారు. సీనియర్ నాయకుడు దొడ్డపనేని కృష్ణయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా వేంసూరు మండలానికి ఇప్పటికీ సాగునీరు అందలేదన్నారు. ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసరావు, నాయకులు కొప్పుల మధుసూదన్‌రెడ్డి, బండి వెంకటరెడ్డి, చల్లా అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.9 లక్షల ఆర్‌ఓ ప్లాంట్.. ఇంకా ప్రారంభం కాలేదు

## రేజర్లలో ప్రజలకు అందని మంచినీరు



**సత్తుపల్లి/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండటం బాధాకరమని బీజేపీ నాయకులు సాలి శివకృష్ణ, ఎస్కే రహమతుల్లా అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్లలో సింగరేణి సీఎస్‌ఆర్ నిధులతో సుమారు రూ. 9 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్లాంట్ నేటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు చేసినా ప్రజలకు తాగునీరు అందకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రేజర్లతో పాటు మండలంలోని అన్ని ఆర్‌ఓ ప్లాంట్లను అధికారులు పరిశీలించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## సీఐ అంజలి సమయస్ఫూర్తి.. తప్పిన ముప్పు



**మహబూబాబాద్/ సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామాలయం లైన్ అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విధి నిర్వహణలో అటుగా వెళ్తున్న ఇన్‌చార్జి టౌన్ సీఐ అంజలి మంటలను గుర్తించి వెంటనే సిబ్బందితో అప్రమత్తమయ్యారు. స్థానికుల సహకారంతో నీటిని తెప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సీఐ అంజలి సమయస్ఫూర్తితో వ్యవహరించడంపై స్థానికులు, వ్యాపారులు అభినందించారు.

# అథ్లెటిక్స్‌లో మిరాకిల్ మైండ్ విద్యార్థుల సత్తా



**సత్తుపల్లి/ సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మండలస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మిరాకిల్ మైండ్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటి విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకువచ్చారు.

అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగులో పాఠశాలకు చెందిన పార్థు (9వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం సాధించాడు. అండర్-14 బాలికల విభాగంలో సాత్విక (7వ తరగతి) 100 మీటర్ల పరుగులో ప్రథమస్థానం సాధించడంతోపాటు లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. దీంతో విద్యార్థుల ప్రతిభకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

విజేత విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎం. రత్నాకర్ ప్రత్యేకంగా అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను




ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక క్రీడా ఉపాధ్యాయుల నిరంతర శిక్షణ, విద్యార్థుల కృషి అభినందనీయమని కొనియాడారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### మండపాల భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు

**కేసముద్రం/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ సత్యనారాయణ, ఎస్సై కె. క్రాంతికిరణ్ సూచించారు. రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మండపాల వివరాలను పోలీస్‌శాఖ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండపాల భద్రత విషయంలో నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపం వద్ద 24 గంటలు వాలంటీర్ ఉండేలా చూడడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. విద్యుత్ వైర్లు, కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలి. అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించేలా రెండు బకెట్ల నీరు, అవసరమైన



అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా ఖాళీగా ఉంచాలి. మండపాల వద్ద మద్యం, పేకాట, అసభ్యకర కార్యక్రమాలకు తావివ్వరాదన్నారు. రాత్రి 10 గంటల



తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని, శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# మంటలపై అప్రమత్తతే రక్షణ



**కేసముద్రం/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణనష్టం నివారించుకోవాలని కేసముద్రం అగ్నిమాపక దళ ఏఎస్ఐ రాజేందర్ సూచించారు. అమీనాపురంలోని లిటిల్ సిటిజన్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫైర్ సేఫ్టీ అవగాహన సదస్సులో ఆయన సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థులు, ఉపాధ్యాయులు కంగారుపడకుండా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాల్సిన విధానాన్ని వివరించారు. మంటలను అదుపు చేయడంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, ప్రమాద సమయంలో ఎలా స్పందించాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయిలు కోటేశ్వరరావు, కరస్పాండెంట్ రాయిలు శకుంతల, ఉపాధ్యాయులు జ్యోతి, రజిత, స్రవంతి, ప్రీతి, శివాని, ప్రశాంతి, ఫర్జానా, సౌజన్య, శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అంతరాయం లేకుండా త్రీఫేస్ విద్యుత్ అందించాలి

## -అఖిల భారత రైతు-కూలీ సంఘం డిమాండ్.







**బయ్యారం/,సెప్టెంబర్ 11.(జర్నలిస్ట్ వార్త)** వ్యవసాయ రంగానికి ఎలాంటి అంతరాయం లేకుండా పగటిపూట కనీసం 9 గంటల పాటు త్రీఫేస్ విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేయాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం డిమాండ్ చేసింది. అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం కొత్తపేట సబ్ స్టేషన్ ముందు మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రహదారిపై వినూత్నంగా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు జడ సత్యనారాయణ, మోకాళ్ళ మురళీకృష్ణలు మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందని, భూమిలో తేమ శాతమూ పడిపోయిందన్నారు. అరకొర వర్షాలతో బోర్లు, బావులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతన్నలకు అడ్డగోలు విద్యుత్ కోతలు శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లముందే పంటలు ఎండిపోతుండటంతో చేసేదేమీ లేక రైతులు తమ పైర్లలో పశువులను మేపుకునే దయనీయ స్థితికి చేరుకున్నారని తెలిపారు. బయ్యారం ఏజెన్సీ ప్రాంతంలో కరెంట్ కోతల వల్ల రైతులు రాత్రింబవళ్లు చేల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కరెంట్ కోతలను నివారించాలని, పంటలు నష్టపోతే దానికి విద్యుత్ శాఖ, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోతు నరసింహ, తోకల వెంకన్నలతో పాటు మేకపోతుల నాగేశ్వరరావు, ఏపూరి వీరభద్రం, నేతగాని రాకేష్, పూణెం లింగన్న, మోకాళ్ళ రమేష్, బానోత్ హోలీ, తోటకూరి రామకృష్ణ, గుండెబోయిన లింగమల్లు, మేంగు భగవాన్, వీరబోయిన ఐలయ్య, ధారావత్ మంగీలాల్, భీముడు, కొత్త రాందాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం.

### -తుమ్మల శ్రీనివాస్ రావు హర్షం.



**బయ్యారం/,సెప్టెంబర్ 11:(జర్నలిస్ట్ వార్త)** ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న గద్వాల-డోర్నకల్ నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు మంజూరుకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డికె. అరుణ ప్రత్యేక కృషి చేశారని కొనియాడారు. 308.28 కిలోమీటర్లు, 8,993.77 కోట్లు నిధులు మంజూరికి కేంద్రం ఆమోదం తెలిపింది. గద్వాల వద్ద ప్రారంభమై మోతె, మరిపెడ, సీరోల్, వెన్నారం మీదుగా డోర్నకల్ వరకు సాగనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, రవాణా సౌకర్యాలకు ఈ లైన్ కొత్త బాటలు వేస్తుందని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నీటి ఎద్దడికి చెక్.. కొత్త బోర్‌వెల్‌కు శ్రీకారం



**తల్లాడ/సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మల్లారం గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని కొత్త హ్యాండ్ బోర్‌వెల్ తవ్వకం పనులను శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ కటికి కిరణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీటిని అందించడమే పంచాయతీ పాలకవర్గం లక్ష్యమన్నారు. నీటి సరఫరా సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సర్పంచ్, ఉపసర్పంచ్ ధరావత్ యశోద, పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ సమక్షంలో బోర్‌వెల్ తవ్వకం పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు ఎర్రి నరసింహారావు, కృష్ణారావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య అంజయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ు

## చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

### సెప్టెంబరు 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి




**వరంగల్/సెప్టెంబర్ 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు పాఠశాలలు, కళాశాలల పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. పోచమ్మ మైదాన్ సెంటర్‌లోని పోరాట యోధులు చేన్నబోయిన కమలమ్మ, అప్పన్నల స్థూపాలకు సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాష్ మియా మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, మహిళలు సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సెప్టెంబరు 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కోరారు. చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు, మేకల రవి, పంజాల రమేష్, గుండె బద్రి, అక్కపెల్లి రమేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, వరంగల్ జిల్లా సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యుడు ఆరెల్లి ప్రభాకర్, వర్ధన్నపేట మండల కార్యదర్శి బొడ్డు పెల్లి సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం సిపిఎం కార్యాలయంలో ఆదర్శ వివాహం.




**బయ్యారం/,సెప్టెంబర్ 11.(జర్నలిస్ట్ వార్త)**ప్రేమించిన జంటను కలుపుతూ స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో నంబూరి మధు అధ్యక్షతన,ఆచార్య మండా రాజన్న సమక్షంలో శుక్రవారం ఆదర్శ వివాహం వైభవంగా నిర్వహించారు.వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన ముక్తి రామారావు-రేఖ దంపతుల కుమార్తె ముక్తి పవిత్ర,మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన యాట వెంకన్న-లత దంపతుల కుమారుడు యాట వీరబాబు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు.తమ పెళ్లి విషయమై వారు వేజర్ల సైదులు రావు భవనంలోని సిపిఎం పార్టీ కార్యాలయాన్ని ఆశ్రయించగా,నాయకులు ఇరువైపుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.అయితే అమ్మాయి తరపు తల్లిదండ్రులు ఈ వివాహానికి నిరాకరించారు.ఇద్దరూ మేజర్లు కావడం,ఒకరినొకరు వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉండటంతో నాయకులు వారికి పార్టీ కార్యాలయంలోనే ఆదర్శ వివాహం జరిపించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వల్లాల వెంకన్న,అంగిరేకుల నాగేశ్వరరావు,కత్తి రమేష్ రాజా,వెన్ను మోహన్,కంకటి వీరన్న,బొమ్మగాని శీను,హేమంత్,సునీల్,లోకేష్,వెంకటేష్,భరత్,విష్ణు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు,బూట్లు పంపిణీ.

-సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.



**బయ్యారం/,సెప్టెంబర్ 11.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల పరిధిలోని జగ్గుతండా గ్రామపంచాయతీలోని ఎంపీయూపీఎస్ రంగాపురం పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫాంలు,బూట్లను సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని,విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణరావు,కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ధనంజయ్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు,ప్రీ ప్రైమరీ ఇన్స్పెక్టర్ షేక్ రజియాతో పాటు ఉపాధ్యాయులు రాంబాబు,మంగీలాల్,గౌసియా,లింగా, రమేష్,లక్ష్మీనారాయణ,రామారావు,గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా.. సర్కారు వైద్యం!

### ఖమ్మం సర్వజనాసుపత్రిలో ఆధునిక సేవల విస్తరణ



**ఖమ్మం/సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ వైద్యానికి ఆధునిక సాంకేతికత జోడవుతోంది. ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అత్యాధునిక వైద్య పరీక్షలు, స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, నిపుణుల సేవలను బలోపేతం చేస్తున్నారు. త్వరలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు**
ఆసుపత్రికి మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర రోగులను విభాగాల మధ్య తరలించాల్సిన అవసరం లేకుండా అవసరమైన చోటే పరీక్షలు నిర్వహించే వీలు కలిగింది. కదలలేని రోగులకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా మారింది.

**పడక వద్దే ఎక్స్‌రే**
పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రంతో తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు పడక వద్దే పరీక్షలు చేస్తున్నారు. దీంతో రోగులను ఎక్స్‌రే విభాగానికి తరలించే ఇబ్బందులు తగ్గాయి. టీ-హబ్‌లో అదనపు ఎక్స్‌రే, మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఉన్నాయి.

**8 నెలల్లో 13,816 స్కాన్లు**
2026 జనవరి నుంచి ఆగస్టు వరకు సర్వజనాసుపత్రిలో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 పరీక్షలు జరిగాయి. జనరల్ మెడిసిన్, సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర విభాగాల రోగులకు అవసరాన్ని బట్టి సేవలు అందిస్తున్నారు.

**మాతా శిశు కేంద్రంలో 16,961 స్కాన్లు**
మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఎనిమిది నెలల్లో 16,961 స్కాన్లు నిర్వహించారు. ఇందులో 8,945 ఓబీజీ, 5,417 ఉదర భాగం, 546 టిఫ్ఫా, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి. టిఫ్ఫా స్కాన్‌తో గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంది.

**కలర్ డాప్లర్.. సీటీ సేవలు**
కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. రక్తనాళాల్లో అడ్డంకులు, రక్తం గడ్డకట్టడం, మెదడు సంబంధిత వ్యాధులు, ప్రమాద గాయాలు, ఊపిరితిత్తుల సమస్యలను గుర్తించడంలో ఇవి ఉపయోగపడుతున్నాయి.

**త్వరలో ఎంఆర్ఐ**
ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎంఆర్ఐ అందుబాటులోకి వస్తే మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలకు సంబంధించిన సమస్యలను గుర్తించడంలో ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

**రేడియాలజీకి నిపుణుల బలం**
రేడియాలజీ సేవలను బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులను అందుబాటులోకి తెస్తున్నారు. డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. డాక్టర్ మురళీకృష్ణ సేవలను కూడా సర్వజనాసుపత్రికి వినియోగించేలా చర్యలు చేపట్టారు. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీల భర్తీకి చర్యలు కొనసాగుతున్నాయి.




**పేదలకు ఆర్థిక భారం తగ్గింపు**
అల్ట్రాసౌండ్, డాప్లర్, సీటీ, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ, టిఫ్ఫా వంటి ఆధునిక పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతోంది. అధునాతన పరికరాలతో పాటు నిరంతర సేవలు అందేలా మౌలిక వసతులు, విద్యుత్, వైద్య సిబ్బందిపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

## ఒకపక్క వెలుగు.. మరోపక్క చీకటి

### గోపాలకుంట కాలనీలో వీధిలైట్ల సమస్య

**కల్లూరు/ సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
ఒకపక్క వెలుగు.. మరోపక్క చీకటి.. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు గోపాలకుంట కాలనీలో వీధిలైట్ల పరిస్థితి ఇలా ఉంది. కాలనీలోని రామాలయం, పోలీస్‌స్టేషన్, పుల్లయ్య బంజర్ రోడ్డును కలిపే ప్రధాన కూడలిలో సరైన వెలుతురు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ఈ కూడలి మీదుగా నిత్యం వందలాది మంది ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రధాన కూడలిలోని విద్యుత్ స్తంభానికి ఒక్క వీధిలైటు మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ఒకవైపు మాత్రమే



వెలుతురు పడుతుండగా.. మిగిలిన రెండు వైపులా చీకటి అలుముకుంటోంది.రాత్రి వేళల్లో అరకొర వెలుతురుతో మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అదనపు లైటు ఏర్పాటు చేయాలి**
ప్రధాన కూడలిలో నెలకొన్న సమస్యను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ స్తంభానికి అదనంగా మరో వీధిలైటును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడలిలో నెలకొన్న చీకట్లను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీసీ కులగణన చేపట్టాలి

### అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి




**వర్ధన్నపేట/ సెప్టెంబర్ 11(జర్నలిస్ట్ వార్త):**జనాభా లెక్కలతోపాటు బీసీల కులగణన చేపట్టాలని, ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి కోరారు. రామవరం గ్రామంలో మునిగాల సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభలు, బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి మేరకు వాటా దక్కాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పుడు బీసీల జనాభాను లెక్కించి వారి హక్కులను నిర్ణయించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. బీసీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం లేకపోవడంతోనే వారు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు.కేంద్రం చేపట్టనున్న జనాభా లెక్కల్లో బీసీల కులాల వారీగా వివరాలు సేకరించాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే బీసీల వాస్తవ జనాభా, వారికి దక్కాల్సిన వాటాపై స్పష్టత వస్తుందన్నారు. బీసీల హక్కుల కోసం రాజకీయాలకు అతీతంగా వారిని ఏకం చేసి ఉద్యమిస్తామని చెప్పారు.గ్రామ కమిటీ ఎన్నిక: అనంతరం బీసీ హక్కుల సాధన సమితి రామవరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునిగాల సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకోజు సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా తోట వెంకటేష్, కోశాధికారిగా కుల్లా రాకేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్ పోశాల మధుకర్ వారికి కండువాలు కప్పి అభినందించారు. సమావేశంలో పిట్టల భాస్కర్, పెద్దూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాటల సర్కార్‌గా మారిన రేవంత్ ప్రభుత్వం

### -బీఆర్ఎస్ నేత తీవ్ర విమర్శలు.



**బయ్యారం/,సెప్టెంబర్ 11.(జర్నలిస్ట్ వార్త)**
రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ అన్నదాతలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని బిఆర్ఎస్ పార్టీ బయ్యారం మండల సోషల్ మీడియా ఇంచార్జ్ రేపాకుల వెంకన్న మండిపడ్డారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి,నేడు కేవలం 5 నుండి 6 గంటల అరకొర విద్యుత్ మాత్రమే ఇస్తున్నారన్నారు.బయ్యారం పెద్ద చెరువు నిండా నీరు ఉన్న సాగు భూములకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయన్నారు.అదే విధంగా యూరియా పంపిణీకి కొత్త యాప్‌లు తీసుకొచ్చి గ్రామీణ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు.రైతులకు ఎటువంటి కోతలు లేకుండా వెంటనే 24 గంటల ఉచిత కరెంట్‌తో పాటు సాగునీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని,లేకపోతే రైతు ఆగ్రహానికి గురై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని రేపాకుల హెచ్చరించారు.

